## క్లుప్తంగా

### ఘనంగా సీతారామచంద్రస్వామి పట్టాభిషేక మహోత్సవం

**పిట్టలవానిపాలెం:** పిట్టలవానిపాలెం గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జ్యేష్టాభిషేక మహోత్సవ పూర్వక పట్టాభిషేక మహోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం శ్రీనివాసాచార్యులు, బృందావనం గోపీచంద్ మాట్లాడుతూ ఈ నెల 25 వరకు ఉత్సవాలు జరుగుతాయని 25న పుష్ప యాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం స్వామివారికి 108 కలశాలతో జ్యేష్టాభిషేక మహోత్సవం జరుగుతుందని తెలిపారు. గురువారం ప్రత్యేక పూజల అనంతరం శ్రీరామపట్టాభిషేక మహోత్సవం, పుష్పయాగం నిర్వహించనున్నట్లు తెలిపారు.

### ఘనంగా హరిద్ర శృంగార్చన



**పిట్టలవానిపాలెం:** చందోలు గ్రామంలోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ ఆలయంలో వివాహం కాని ఆడ పిల్లలకు శీఘ్రంగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

### అనుమతి లేనిదే ఇసుక తోలకాలు చేయకూడదు



**పిట్టలవానిపాలెం:** అనుమతి లేనిదే ఇసుక తోలకాలు చేయరాదని మండల తహసీల్దారు డి.కవిత హెచ్చరించారు. మంతెనవారిపాలెం శివారులోని పొలాల్లో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న ఆమె మంగళవారం అక్కడకు చేరుకున్నారు. గ్రామానికి చెందిన ఓ రైతు తన నాలుగు ఎకరాల పొలం నుంచి ఓ వైపున ఇసుకను తీసి, మరో వైపు పొలాన్ని పూడ్చుకుంటూ ఉన్నట్లుగా గమనించారు. సదరు రైతు తన పొలంలో ఇసుకను తీసి తన పొలంలోనే పని చేసుకుంటున్నానని ఇదికూడా తప్పేనా అని ప్రశ్నించారు. అయితే ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడి నిబంధనల మేరకు పనిచేసుకోవాలని అప్పటి వరకు ఇసుక తోలకాలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### ఉత్త సేవకు గుర్తింపు..



**భట్టిప్రోలు:** పల్లెకోన గ్రామానికి చెందిన గ్రేస్ ఫౌండేషన్ చైర్మన్ కైతేపల్లి షాలేమ్‌రాజు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, పలువురికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలవడంతో నేషనల్ బెస్ట్ సర్వీస్, ఇంటర్నేషనల్ గ్లోరి, ఐకాన్ ఆఫ్ ది ఇయర్–2023 అవార్డులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్ విజయపురి కాలనీలో మర్రి కృష్ణారెడ్డి హాలులో అనన్య ఫౌండేషన్ సౌజన్యంతో ఎంవీఆర్ కల్చరల్ అకాడమి ఆధ్వర్యంలో మనం ఫౌండేషన్ ఈ అవార్డులను షాలేమ్ రాజుకు ప్రదానం చేశారు. తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ గుర్తించిన నిర్మల చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు.

### ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల



**చుండూరు(భట్టిప్రోలు):** చుండూరు మండలం వలివేరు గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్ల మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి, భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. జగన్ యూత్ సభ్యులు మజ్జిగ, కూలింగ్ మినరల్ వాటర్ భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దాట్ల మోహన్‌రెడ్డి, శివప్రసాద్ రెడ్డి, వీరారెడ్డి, దవేంద్రరెడ్డి, విక్రం రెడ్డి, గిరిధర్ రెడ్డి, దినేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టిసారించాలి

**ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు**



మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

**చెరుకుపల్లి:** ప్రస్తుత వేసవిలో మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న సమస్యాత్మక గ్రామాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. ఆయా గ్రామాలకు ప్రత్యేకంగా ట్యాంకర్లు ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారని, ఆయన ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకుంటే వివరాలు తెలుసుకుని, అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇటీవల నిజాంపట్నంలో నిర్వహించిన మత్స్యకార భరోసా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## వలంటీర్లకు పురస్కారాలు



వలంటీర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంపీడీఓ రాధారమణ

**నగరం:** లాభాపేక్ష లేకుండా సేవే పరమావధిగా గ్రామ వలంటీర్లు పనిచేస్తున్నారని ఎంపీడీవో ఎస్.రాధారమణ పేర్కొన్నారు. మండలంలోని నగరం, పూడివాడ, అల్లపర్రు గ్రామ సచివాలయాల్లో మంగళవారం జరిగిన గ్రామ వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. అవినీతి, వివక్ష, లంచాలకు తావు లేకుండా గ్రామ సచివాలయ వ్యవస్థ పనిచేస్తుందని కొనియాడారు. వలంటీర్ల సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలను అందిస్తోందని చెప్పారు. అనంతరం పురస్కారాలు పొందిన వలంటీర్లను సన్మానించారు. సర్పంచ్‌లు ఇంకోల్లు రామకృష్ణ, పాగోలు సుజాత, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదర్శ వేదిక సేవలు ఎనలేనివి



మజ్జిగ పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మల్లికార్జునరావు

**రేపల్లె:** పట్టణ ఆదర్శ వేదిక సేవలు ఎనలేనివని తహసిల్దార్ డి.మల్లికార్జునరావు అన్నారు. పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. కోవిడ్ సమయంలో ఆదర్శ వేదిక సభ్యులు అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. నిరాధారణకు గురైన వారికి, భిక్షాటన చేసే వారికి భోజనాలు అందించటం, వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఆదర్శ వేదిక సభ్యులు తమ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతపరచాలని కోరారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పేటేరు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మోహన్, ఆదర్శ వేదిక పట్టణ కన్వీనర్ యడ్లపల్లి కిషోర్ బాబు, సభ్యులు సాయి కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## బీమా పథకాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీజీజీబీ మేనేజర్ మురళి

**కర్లపాలెం:** బీమా పథకాలపై అవగాహన కలిగి ఉండాలని కర్లపాలెం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఎ.మురళి పేర్కొన్నారు. మంగళవారం కర్లపాలెంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బీమా పథకాలపై వీవోఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మేనేజర్ మురళి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జీవనజ్యోతి, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, ప్రధాన మంత్రి అటల్ పెన్షన్ యోజన పథకాలు అమలులో ఉన్నాయని తెలిపారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ ఎస్.భగత్ మాట్లాడుతూ తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనం ఉండే బీమా పథకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఏపీఎం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళలకు ఆర్థిక భద్రత ముఖ్యమని చెప్పారు. వైఎస్సార్ బీమా పథకం వర్తించనివారు.. ప్రధానమంత్రి జీవన జ్యోతి, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు పూర్ణ చంద్రరావు, శివకోటేశ్వరరావు, లక్ష్మీ సోమేశ్వరి పాల్గొన్నారు.

## కొల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారిపై విచారణ

- హెల్త్ సూపర్‌వైజర్ వ్యవహార తీరుపై ఆరా
- విచారణాధికారుల ఎదుట గోడు వెళ్లబోసుకున్న వైద్యాధికారి భార్య, కుమార్తె



పీహెచ్‌సీలో విచారణ చేస్తున్న హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారులు

**కొల్లూరు:** కొల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి, హెల్త్ సూపర్‌వైజర్‌పై ఫిర్యాదు అందడటంతో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ టీవీఎస్ఎస్ శాస్త్రి, ఫ్యామిలీ ప్లానింగ్ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీలు విచారణలో పాల్గొన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డి.రవిబాబు, హెల్త్ సూపర్‌వైజర్ వి.మేరీపై అనంతవరం సచివాలయ ఏఎన్ఎం పీఎస్‌బీ కుమారి పలు ఆరోపణలు చేస్తూ.. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో వైద్యశాల సిబ్బంది, ఆశ కార్యకర్తలను, అనంతవరం సచివాలయ సిబ్బందిని అధికారులు విచారించారు.పీహెచ్‌సీ వైద్యాధికారి రవిబాబు ప్రధానంగా వైద్యశాల పరిధిలోని ఓ మహిళా సిబ్బందితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని, విధుల్లో మద్యం సేవించి రోగులకు అందుబాటులో ఉండటం లేదని, వైద్యశాలలోని ఓ గదిని బెడ్‌రూమ్‌గా మార్చుకుని అక్కడే మద్యం సేవిస్తూ పలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని, ఆపరేషన్ థియేటర్‌ను వంటశాలగా మార్చుకోవడం వంటి ఆరోపణలు విచారణాధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. హెల్త్ సూపర్‌వైజర్ మేరీ అనంతవరంలో పనిచేసే ఓ ఆశ కార్యకర్తకు, ఏఎన్ఎంకు మధ్య కులాల చిచ్చు పెట్టి వివాదం కొట్లాట వరకు వెళ్లేలా చేసిందనే ఆరోపణపై.. విచారణాధికారులు సచివాలయ సిబ్బంది, గ్రామస్తుల నుంచి సమాచారం సేకరించారు. వైద్యాధికారితో సన్నిహితంగా ఉన్న మహిళా సిబ్బంది వైద్యశాల పరిధిలోని పలువురు సిబ్బందిని మానసికంగా వేధింపులకు గురిచేస్తోందని, ఆమెకు వత్తాసుగా వైద్యాధికారి సిబ్బందితో జరిపే సమావేశాలలో బయట వ్యక్తులను పిలిపించి, ఒకరిని లేకుండా చేయాలనే.. బెదిరింపులకు దిగడం వంటి ఆరోపణలపై సిబ్బందిని అధికారులు విచారించారు.అలాగే వైద్యాధికారి రవిబాబు భార్య, కుమార్తె విచారణాధికారుల ఎదుట హాజరయ్యారు. తమ భర్త వైద్యశాలలో పనిచేసే ఓ మహిళా సిబ్బందితో అక్రమ సంబంధం ఏర్పరుచుకుని, తమ పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నట్లు కొన్ని ఆధారాలతో గోడు వెళ్లబోసుకోవడంతో వివరాలు నమోదు చేసుకున్నారు.

**నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం**

విచారణ అధికారులు టీవీఎస్ఎస్ శాస్త్రి, నిర్మల గ్లోరీలు ఈ విషయమై స్పందిస్తూ.. తమకు ఏఎన్ఎం పీఎస్‌బీ కుమారి చేసిన ఫిర్యాదు ఆధారంగా సిబ్బంది, వైద్యాధికారి భార్య, కుమార్తె వద్ద సమాచారం సేకరించామన్నారు. విచారణలో వెల్లడైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, నివేదికను సిద్ధం చేస్తామన్నారు. ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు. పీహెచ్‌సీ పనితీరు మెరుగు పరిచేందుకు అధికారులకు సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు.

## బైక్ ర్యాలీ గోడ ప్రతుల ఆవిష్కరణ



**పెరవలి(వేమూరు):** మరాఠ పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం జూన్ 2న నిర్వహించనున్నట్లు గాజుల శివనారాయణ తెలిపారు. ఈ మేరకు పెరవలి గ్రామంలో మంగళవారం గోడ ప్రతులు, కర పత్రాలు, బైక్ స్టిక్కర్లు అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలిలో మార్కెట్ యార్డు నుంచి శివాజీ చౌక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, గరిక నాంచారయ్య, బండినారాయణ, దేవరపల్లి సుబ్బారావు, జూపూడి యుగంధర్, బేతపూడి సుబ్బయ్య, బొమ్మిడి అక్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అమలు

**'గడప గడపకు' కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున**



వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

**పొంచాళ వరం(వేమూరు):** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండలంలోని పొంచాళవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి.. సంక్షేమ పథకాల అమలు తీరు గురించి లబ్ధిదారులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందని కుటుంబాలు తన దృష్టికి తీసుకొని రావాలని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఆయన చెప్పారు. గత ప్రభుత్వానికి, జగనన్న పాలనకు మధ్య తేడాలను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్య, నాణ్యమైన భోజనం అందిస్తోందని గుర్తుచేశారు. గ్రామస్తులు కొన్ని సమస్యలను తన దృష్టికి తీసుకు రావడంతో.. అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ నిధులతో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని దీవించాలని ప్రజలను కోరారు. ఎంపీపీ రాపర్ల నరేంద్ర, అమిరి రత్నకర్, లాం బోస్, యలవర్తి సురేష్,.ఈమని రాంబాబు, ఎం.నాగరాజు, తురిమెళ్ల వెంకట్, తురిమెళ్ల సాంబయ్య, శ్యాం ప్రసాద్, తురిమెళ్ల నారాయణ, మూల్పూరు గ్రామ సర్పంచ్ మూల్పూరు జయ శ్రీ, పెదపూడి సర్పంచ్ పెదపూడి ఆనంద్, ఈపూరు బాబురావు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### 'చుక్కలు' తొలగించాలి



తాతా సాయిబాబా

**భట్టిప్రోలు:** మాజీ సీఎం చంద్రబాబునాయుడు పేద రైతుల భూములకు చుక్కలు పెట్టినందుకు వందలాది ఆత్మహత్యలు చేసుకున్నారని జనతాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు తాతా సాయిబాబా మంగళవారం ఆరోపించారు. 2022లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చుక్కలు తొలగించామని ప్రకటించగా రైతు బాంధవుడని పేరు గాంచారని పేర్కొన్నారు. ఐతే ప్రభుత్వ ఉత్తర్వులను భేఖాతరు చేస్తూ దేవాదాయ శాఖ మాత్రం చుక్కలను తొలగించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని చుక్కలను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

### సీపీఎం మాజీ నేత వెంకటేశ్వరరావు మృతి



**రేపల్లెరూరల్:** సీపీఎం మాజీ నేత ముమ్మలనేని వెంకటేశ్వరరావు(88) సోమవారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందారు. పట్టణంలోని 12వ వార్డులో ఆయన స్వగృహానికి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు మంగళవారం తీసుకువచ్చారు. ఆయన పేదల కోసం అనేక ఉద్యమాలు చేశారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో రాణించి రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ కనపరిచారు. మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సభ్యునిగా పలు సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. వెంకటేశ్వరరావు మృతదేహాన్ని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ సందర్శించి, నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. అనంతరం వెంకటేశ్వరరావు భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**రేపల్లె రూరల్:** మండలంలోని లంకెవానిదిబ్బ, గంగడిపాలెం, పోటుమెరక విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ డీఈ భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌ల మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ కోతలను వినియోగదారులు గమనించి, సహకరించాలని పేర్కొన్నారు.

### వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

**రేపల్లె:** వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జనవిజ్ఞాన వేదిక సభ్యుడు కే.సాయిప్రసాద్ కోరారు. జన విజ్ఞాన వేదిక, యూటీఎఫ్ బాలల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని లాల్‌బహదూర్ పాఠశాలలో శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరాలను వినియోగించుకుని మేధాశక్తిని పెంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక సభ్యులు పాల్గొన్నారు.

## మంత్రి నాగార్జునకు అభినందనలు



కేక్ కట్ చేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

**పొంచాళవరం(వేమూరు):** ఎమ్మెల్యేగా గెలిచి నాలుగేళ్లు పూర్తికావడంతో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మంగళవారం వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమక్షంలో మంగళవారం కేక్ కట్ చేశారు. అమర్తలూరు మండలంలోని పొంచాళవరం గ్రామంలో ఈ మేరకు సంబరాలు చేసుకున్నారు. పార్టీ నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలుమూరు ఎంపీటీసీ అమిరిశెట్టి శ్రీధర్, మాతంగి రత్నకుమార్, ఎంపీపీ రాపర్ల నరేంద్ర, యలవర్తి సురేష్, లాం బోస్, ఈపూరు బాబురావు, పీకా సన్నీ దేలా, మేక రామ కృష్ణ, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రసన్న దుర్గాభవానీ దేవాలయంలో ప్రత్యేక పూజలు



**బాపట్ల:** బాపట్ల పట్టణం లోని ఎస్ఎస్‌పీ అగ్రహారంలో వేంచేసియున్న శ్రీ ప్రసన్న దుర్గాభవానీ మాత ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ 22వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. హోమాలు, పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారి కల్యాణం, పూర్ణాహుతి నిర్వహించారు. శ్రీ ప్రసన్న దుర్గాభవాని మాత ఆలయ జ్ఞాన పీఠ భక్త సమాజం ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

## ప్రజల మన్ననలే వలంటీర్లకు అవార్డులు

**ఎమ్మెల్యే కోన రఘుపతి**



వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, తదితరులు

**బాపట్ల అర్బన్:** ప్రజల మన్ననలే వాలంటీర్లకు అవార్డులని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాపట్ల మండలం వేదుళ్ళపల్లి గ్రామంలో సేవా రత్న, సేవా మిత్ర అవార్డులకు ఎంపికైన వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులకు అందజేయడంలో ప్రతి వలంటీర్ కష్టపడి పనిచేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయం , వలంటీర్ల వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవడం గర్వకారణమన్నారు. ప్రభుత్వంలో భాగస్వామిగా పనిచేస్తున్న వలంటీర్లు సేవా దృక్పథంతో అందిస్తున్న సేవలు కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించిన అవకాశాన్ని సద్వినియోగపరుచుకుని ప్రజలకు మరిన్ని సేవలందించి వారి మన్ననలు పొందాలని కోరారు. బాపట్ల మండలంలో మూడు సంవత్సరాల్లో 30 వేల మందికి రూ.222.56 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా నేరుగా బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనిని వలంటీర్లు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మండల పార్టీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, వడ్డీముక్కల డేవిడ్, ఈవోపీఆర్డీ పులిశరత్ బాబు, ఎంపీడీవో ఎ.రాధాకృష్ణ, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



కార్యదర్శికి వినతిపత్రం అందచేస్తున్న సీపీఐ నాయకులు

**భట్టిప్రోలు:** పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి. నాగాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యుడు గొట్టుముక్కల బాలాజీ మంగళవారం కోరారు. అకాల వర్షాల కారణంగా తడిచి రంగు మారిన పసుపును మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం పిలుపు మేరకు పెదపులివర్రు గ్రామ సచివాలయ కార్యదర్శి ఎస్.రాజశేఖరరెడ్డికి రైతులతో కలసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు కొమ్మినేని శ్రీమన్నారాయణ, కొసరాజు సతీష్‌బాబు, జి. వెంకటేశ్వరరావు, సుంకర జగన్‌మోహన్‌రావు, రవీంద్ర, బి. సురేష్, కె. బాబురావు, కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఎద్దడి మొదలైంది.. ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



అద్దేపల్లిలో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా

**అద్దేపల్లి(భట్టిప్రోలు):** భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి దళితవాడలో భూగర్భ జలాలు ఇంకిపోవడంతో ప్రతి నిత్యం ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు సర్పంచ్ దారా రవి కిరణ్మయి మంగళవారం తెలిపారు. వేసవి దృష్ట్యా ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఉదయం, సాయంత్రం ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నామన్నారు. స్థానిక దళితవాడలోని డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీరు సరఫరా చేసే ఫిల్టర్ పాయింట్లలో భూగర్భ జలాలు ఎండిపోయిన దృష్ట్యా ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు.

### చినపరిమిలో ధర్మ ప్రచారం

**చుండూరు(భట్టిప్రోలు):** త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో మంగళవారం చుండూరు మండలం చినపరిమిలో ఆధ్యాత్మిక గ్రంథాల ధర్మ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంతం హిందూ జ్ఞాన వేదిక-ప్రబోధ సేవా సమితి ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలు ప్రతి ఒక్కరూ చదివాలని, స్వామి ప్రసంగాలు విని ఆత్మజ్ఞానం తెలుసుకుని భారతదేశానికి పూర్వ వైభవం తేవాలన్నదే తమ ఉద్దేశ్యం అన్నారు. కార్యక్రమంలో సభ్యులు రామకృష్ణ, కృష్ణారావు, బోనేపల్లి శ్రీనివాస్, శివలింగం హరిబాబు, రౌతు శ్రీదేవి, పరిమళ, అన్నపూర్ణ, దిల్షా తదితరులు పాల్గొన్నారు.

### విశ్రాంత అధ్యాపకుడు ప్రసాద్ మృతి

**బాపట్ల:** నందిరాజుతోటకు చెందిన విశ్రాంత అధ్యాపకుడు పీటా ప్రసాద్(71) మంగళవారం మృతి చెందారు. ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడిగా సుదీర్ఘకాలం పని చేసిన ఆయన పలువురికి సుపరిచితుడు. ప్రసాద్ మృతి పట్ల వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీటా వేణుగోపాల్, మురళీధర్, వెంకటరమణ, శివశంకర్ సంతాపం తెలిపారు.

## 'యాప్' లోన్ తీర్చలేక మరో యువకుడు మృతి..

- గడ్డి మందు తాగడంతో.. రేపల్లె వైద్యశాలలో చికిత్స
- వారం రోజులు మృత్యువుతో పోరాటం..



**రేపల్లె రూరల్:** గడ్డి మందు తాగి యువకుడు మృతి చెందిన ఘటన మైనేనివారిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సురేష్ వివరాల మేరకు నగరం మండలం గౌడపాలేనికి చెందిన చెన్నుసాయి(22) కొంతకాలంగా రేపల్లె మండలంలోని మైనేనివారిపాలెంలో తన తండ్రి నాగమల్లేశ్వరరావు వద్ద ఉంటున్నాడు. డిగ్రీ పూర్తయిన తర్వాత ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ ఆన్‌లైన్ యాప్ ఎం పాకెట్ ద్వారా రెండేళ్ల క్రితం రూ.40వేలు లోన్ తీసుకున్నాడు. కొంత కాలంగా ఎం పాకెట్ నిర్వాహకులు తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని అడుగగా.. డబ్బులు కట్టలేక మనస్తాపం చెంది.. ఈ నెల 16న గడ్డిమందు తాగాడని తెలిపారు. సాయిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని వివరించారు. తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.